విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 02 సెప్టెంబరు 2025 8 పేజీలు

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో

సత్వరమే న్యాయం అందించాలి

- బాధితులకు పరిహారం, కారుణ్య నియామకాల ప్రక్రియ పూర్తి చేయాలి
- బాధితులకు న్యాయం చేయడంలో రాజీపడొద్దు
- అభివృద్ధి, సంక్షేమంతో పాటు సమస్యలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- ఒంగోలు కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం
- హాజరైన ఎంపీ మాగుంట, జిల్లా ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు సత్వరం పరిష్కారం అయ్యేలా దృష్టి సారించడంతో పాటు, బాధితులకు తక్షణమే పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్‌లో జరిగిన డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మంత్రి స్వామి, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, సంతనూతలపాడు శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు, కందుల నారాయణ రెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, డా.ముక్కు ఉగ్రనరసింహ రెడ్డి, బిఎన్ విజయకుమార్, జిల్లా ఎస్.పి ఎ ఆర్ దామోదర్, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో కలసి పాల్గొని జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు మంజూరు చేయాల్సిన కాంపెన్సేషన్, భూ పరిహారం, ఉద్యోగ నియామకాలు తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఎస్.సి., ఎస్.టిల అభివృద్ధి, సంక్షేమంతో పాటు వారి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సత్వరం పరిష్కారం అయ్యేలా దృష్టి సారించడంతో పాటు, బాధితులకు తక్షణమే పరిహారం ఇచ్చేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ కేసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బాధిత కుటుంబాలకు భూ పరిహారం, కారుణ్య నియామకాల ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి, రెవిన్యూ అధికారులను ఆదేశించారు. 2023 నుండి నమోదైన కేసుల వారీగా మంత్రి సమీక్షిస్తూ బాధితులకు న్యాయం చేయడంలో ఎక్కడా రాజీ పడరాదన్నారు. విచారణ, పోలీసుల దర్యాప్తులో వేగం పెంచాలని న్యాయబద్ధంగా పరిష్కార మార్గం చూపాలన్నారు. ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన మిగతా 2 లో ...

పత్తి రైతులకు అన్యాయం

- రైతు వ్యతిరేక జీవోను వెంటనే రద్దు చేయాలి
- రైతు సంఘాల ధర్నాలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరా రెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-మార్కాపురం : అమెరికన్ సామ్రాజ్యవాద పాలనకు భయపడిన విదేశీ పత్తి దిగుమతులపై ఇప్పటివరకు ఉన్న 11శాతం పన్నును రద్దు చేస్తున్నట్లుగా మోదీ ప్రభుత్వం ప్రకటించడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వీరారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి దిగుమతి పన్నును రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. వీరారెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే తమ సంక్షేమమని గత ఆగస్టు 15వ తేదీ ఎర్రకోటపై మిగతా 2 లో ...

అధ్వానంగా రోడ్లు..
రాకపోకలకు అవస్థలు
4 లో..

పీజీఆర్ఎస్‌లో అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రీఓపెన్ కాకుండా అర్జీలను సకాలంలో, గడువులోగా నాణ్యతతో పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యు అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్ రెడ్డి, వరకుమార్, కుమార్, జాన్సన్‌లతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్జీల పరిష్కారంలో అలసత్వం లేకుండా సకాలంలో పరిష్కరించేలా అధికారులు శ్రద్ద చూపాలన్నారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. పిజిఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని తెలిపారు.

బంగారు కుటుంబాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : బంగారు కుటుంబాలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.బాపట్ల మండలం ఈతేరు గ్రామంలో 15 బంగారు కుటుంబాలకు పంపిణీ చేసిన గేదెలను కలెక్టర్ సోమవారం పరిశీలించారు.పి 4 అమలులో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఈతేరు గ్రామంలో 150 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. అందులో ఎస్టీలు 12 కుటుంబాలు కాగా,115 ఎస్సీ కుటుంబాలు ఉన్నాయని, మిగిలినవి ఇతర సామాజిక వర్గానికి చెందినవారు ఉన్నట్లు చెప్పారు. నిరుపేదలైన బంగారు కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం పి4 విధానాన్ని పక్కాగా అమలు చేస్తుందన్నారు. ఆ గ్రామంల్లో ప్రాథమికంగా 15 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించామన్నారు. ఆయా పథకాలకు లబ్ధిదారులను అనుసంధానిచ్చామన్నారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.50 వేల నుంచి రెండు లక్షల వరకు గరిష్టంగా రుణ సదుపాయం కల్పించామన్నారు. గేదెలు, చేపల వ్యాపారం, కిరాణా, ఫోటో స్టూడియో, బట్టల వ్యాపారం వ్యవసాయ రంగానికి సరిపడా రుణమిచ్చామన్నారు. మొత్తంగా రూ.15.30 లక్షలతో శాశ్వత జీవనోపాధి కల్పించామన్నారు. డి.ఆర్.డి.ఏ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీవో గ్లోరియా తహసీల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

మాగుంటతో దామచర్ల భేటీ

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ సోమవారం ఉదయం మాగుంట కార్యాలయంలో భేటీ అయ్యారు. చాలా రోజుల తరువాత ఇరువురు కలిసి ఏకాంతంగా నగర అభివృద్ధితో పాటు పార్టీ సంస్థాగత వ్యవహారాలు, నామినేటెడ్ పదవులు, బదిలీలు తదితర అంశాలపై చర్చించుకున్నట్లు సమాచారం. సుమారు మిగతా 2 లో ...

విశాలాంధ్ర epaper.visalaandhra.com మంగళవారం 02 । సెప్టెంబరు । 2025

ఫిర్యాదులు వేగంగా పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ దామోదర్

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రకాశం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రజా ఫిర్యాదులను పరిష్కారించుటకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాలుగు దిక్కుల నుండి వచ్చిన ఫిర్యాదారులు జిల్లా ఎస్పీ దామోదర్‌కి, పోలీస్ అధికారులకు విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి సమస్యల పూర్వాపరాలను అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు జిల్లా ఎస్పీ తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యలపై వెంటనే విచారణ చేపట్టి, చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు సత్వరం న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువ భూ వివాదాలు, కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేధింపులు, చీటింగ్/జాబ్ ఫ్రాడ్ మరియు ఇతర సమస్యల గురించి ప్రజా పిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా ఉన్నాయి. చీటి పాట పేరుతో తన వద్ద నుండి గుండాయపాలెంకు చెందిన ఒక మహిళా మరియు మరొకరు లక్ష రూపాయల గల ఒక చీటి కట్టించుకొని చివరకు డబ్బులు చెల్లించకుండా మోసం చేశారని, తాను చెల్లించిన డబ్బులు అడుగుతుంటే ఇవ్వడంలేదని ఒంగోలు మండలం, గుండాయపాలెంకు చెందిన వ్యక్తి పిర్యాదు. ఒంగోలులోని ఓ ఆటో ఫైనాన్స్ ద్వారా హెూండా షైన్ మోటార్‌సైకిల్‌ను రూ. 75,000కి కొనుగోలు చేసి, ముందుగా రూ. 40,000 అడ్వాన్స్‌గా చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన మొత్తం కంటే ఎక్కువ మొత్తాన్ని ఇఎంఐ ల రూపంలో చెల్లించినప్పటికీ, వారు తమం వేలు పెట్టించకుండా, ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంకటేశ్వర కాలనీకి చెందిన వ్యక్తి ఫిర్యాదు. ఒంగోలు, గాంధీ రోడ్డులో ఉన్న బంగారం షాపులో కొత్త బంగారం వస్తువుల కొరకు రూ. 3 లక్షలు నగదు చెల్లించగా, పాత చైన్ తీసుకొని కొత్త చైన్ తయారు చేసి ఇస్తానని చెప్పి బంగారం తీసుకున్నట్టు తెలిపారు. కానీ కొంతకాలంగా బంగారం ఇవ్వకుండా ఇబ్బందిపైటుతున్నారని ఇందిరమ్మ కాలనీకి చెందిన మహిళ ఫిర్యాదు ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ రమణ కుమార్, ఎస్సీ/ఎస్టీ సెల్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, ఇన్స్పెక్టర్ జగదీష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాండు రంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్ రావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

హామీ అమలు చేస్తున్నాం : ఎమ్మెల్యే 'ఉగ్ర'

విశాలాంధ్ర -వెలిగండ్ల: తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి పథకం అమలు చేస్తున్నారని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మొగులూరు గ్రామం నందు వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు ఆయన చేతుల మీదగా పెన్షన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా, పంచాయతీ కార్యదర్శి బండి కొండయ్య, మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

మాగుంటతో దామచర్ల భేటీ

(మొదటిపేజీ తరువాయి)

గంటకు పైగా ఇరువురు భేటీ అయ్యారు. మధ్యలో ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావును పిలిపించి పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు పనులపై వారితో చర్చించారు. అనంతరం మాగుంట, దామచర్ల ఇరువురు రూంలో ఏకాంతంగా మాట్లాడుకున్నారు. ఇటీవల కాలంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ప్రకటిస్తున్న నామినేటెడ్ పదవులతో పాటు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు ఎంపికపై జరుగుతున్న చర్చ, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై ఇరువురు చర్చించుకున్నట్లు తెలుస్తుంది. ఈ మధ్య కాలంలో ఎమ్మెల్యే ఎంపీ మధ్య కొంత దూరం పెరుగుతుందన్న ప్రచారం కూడా జరిగింది. ముఖ్యంగా ఒంగోలు నగరంలో రోడ్లు వెడల్పు చేయడం, పలువురు ఉద్యోగులు బదిలీలు, పార్టీ నామినేటెడ్ పదవుల్లో ఎవరికివారే కొంతమందికి రికమెండేషన్ చేయడంతో దీంతో ఏది చేయాలో ఏది చేయకూడదో అధిష్టానం కూడా కొంత తర్జన భర్జన పడుతున్న సమయంలో ఇరువురు కలిసి బేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం సిగ్గుమాలిన చర్య

- కాంగ్రెస్ నేత బి.ఆర్ గౌస్

విశాలాంధ్ర-ఒంగోలు : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత అయినటువంటి రాహుల్ గాంధీ గారి దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బి ఆర్ గౌస్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ గడిచిన 11 సంవత్సరాలలో దొడ్డిదారిన మూడుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బిజెపి ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి, నేటి వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం రాజ్యాంగంపై ప్రతిరోజు ముప్పేట దాడి చేస్తుందని రాజ్యాంగ సంస్థలను అవహేళన చేసే విధంగా వాటిని నిర్వీర్యం చేస్తుందని, భారతదేశంలో ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారని, నిరుద్యోగం దారుణంగా పెరిగి పోయిందని, పరిశ్రమలు దివాలా తీసేయని, మహిళలపై అగైత్యాలు పెరిగి పోయాయని, కార్మికులు, కర్షకులు రోడ్డున పడ్డారని, రాష్ట్రానికి ఇస్తానన్న ప్రత్యేక హెూదా ఇవ్వకపోగా నిధుల విషయంలో మొండి చేయి చూపించిందని గౌస్ ఆరోపించారు. గెలిచే దమ్ము లేక భారత దేశ సగటు మనిషి ప్రజాస్వామ్య ఆయుధమైనటువంటి ఓటును దొంగిలించి గద్దెను ఎక్కి కూర్చుని, ఈ విషయమై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే, ఈరోజు ప్రతిపక్షాలపై బురద చల్లడం భారతీయ జనతా పార్టీకే చెల్లిందని, ఈ విషయాలన్నీ కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్ష నాయకుల దిష్టిబొమ్మలు తగలబెట్టడం, వారిని విమర్శించడం లాంటివి చేసి ప్రజల దృష్టి మరలించడానికి భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో మంత్రి

విశాలాంధ్ర-మర్రిపూడి : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం పొన్నూరులో ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ పింఛన్లు తొలగిస్తున్నారంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అర్హులైన ఏ ఒక్కరి పింఛనూ ప్రభుత్వం తొలగించడం లేదని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన అందరికీ రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీనే రాష్ట్రంలో 63 లక్షల మందికి రూ. 27,29.66 కోట్లు విలువైన పింఛన్లు ఇస్తున్నామని చెప్పారు. అన్నదాత సుఖీభవ, దీపం, స్త్రీ శక్తి పథకాలు అమలు చేస్తున్నామన్నారు.

పత్తి రైతులకు అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

ఘనంగా ప్రసంగించిన మోడీ 15 రోజుల్లోనే పత్తి రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా జీవో తీసుకురావడం అత్యంత దుర్మార్గమని ఆయన అన్నారు. ఈ దిగుమతి సుంకం రద్దు వలన దేశంలో పత్తిని నమ్ముకుని సాగు చేస్తున్న ఆరు కోట్ల మంది రైతుల జీవనం ప్రశ్నార్ధకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఇప్పటికే పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక మరోవైపు వంట కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు గత్యంతరం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 11 సంవత్సరాల మోడీ పాలనలో రోజుకు 31 మంది చొప్పున ఇప్పటివరకు నాలుగు లక్షల 50 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి వెన్నెముకగా వున్న రైతులకు వారు పండించే పంటలకు రాయితీలు ఇవ్వాలంటే అనేక ఆంక్షలు విధించే మోడీ ప్రభుత్వం మరోవైపు బడా బడా పారిశ్రామిక వేత్తలకు మాత్రం గత 11 సంవత్సరాల కాలంలో 26 లక్షల కోట్ల రూపాయలను రాయితీల రూపంలో వారికి ఇవ్వడం జరిగిందని ఆయన విమర్శించారు. దీన్నిబట్టి మోడీ ప్రభుత్వం దేశ ప్రయోజనాల కన్నా పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే పని చేస్తుందని అర్థమవుతుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం ఒకవైపు దిగుమతులపై సుంకాలను రద్దు చేస్తుండగా మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఆ దేశ దిగుమతులపై 40 నుండి 50 శాతం మేరకు పన్నులు వేస్తున్నారని విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియంతలాగా మాట్లాడుతున్నప్పటికీ మోడీ నేటికీ ఆయన గురించి ఒక్క మాట కూడా మాట్లాడే సాహసం చేయలేకపోతున్నారని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వీరా రెడ్డి ఎద్దేవా చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు డి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తిరోగమన విధానాల ఫలితంగా రైతాంగం పెద్ద ఎత్తున సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికన్ వ్యాపార కంపెనీల ప్రయోజనాల కోసమే మోడీ ప్రభుత్వం దిగుమతిపై 11 శాతం సుంకాలను రద్దు చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అందే నాసరయ్య, నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఎస్కే కాసిం, గిద్దలూరు నియోజకవర్గం రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ధాకాల పుల్లయ్య, వై పాలెం నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు బాణాల రామయ్య, నాయకులు జోసఫ్, నియోజక వర్గ కార్యదర్శి కె. కొండయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు డి. సోమయ్య, డి. పాపిరెడ్డి, గాలి వెంకట రామిరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం పై సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రైతు సంఘాల ప్రతినిధులు సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు అందజేశారు.

సత్వరమే న్యాయం అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

కల్పించేలా క్షేత్ర స్థాయిలో పౌరహక్కుల దినోత్సవాన్ని విస్తృతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎస్.సి., ఎస్.టి గ్రామాల్లో స్మశాన వాటిక ఏర్పాటు మరియు స్మశాన వాటికల ఆధునీకరణకు అవసరమైన మేరకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి కేసుల ఫైలింగ్, ఏ దశలో ఉన్నాయి, నష్టపరిహారం చెల్లింపు తదితర వివరాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు సకాలంలో పరిహారం చెల్లించినప్పుడే వారికి న్యాయం చేకూర్చినట్లు అవుతుందని , అందుకు రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కమిటీ సభ్యులు సమావేశంలో ప్రస్తావించిన అంశాలను ప్రత్యేక దృష్టి సారించి సత్వరం పరిష్కరించేలా అధికారులు శ్రద్ద చూపాలన్నారు. జిల్లా ఎస్పి ఎ.ఆర్ దామోదర్ మాట్లాడుతూ, బాధిత కుటుంబాలకు మేలు జరిగేలా దర్యాప్తులో జాప్యం లేకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులలో ఆలసత్వం ఉండకుండా పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. కమిటీ అనధికార సభ్యులు పల్లె మనీందర్ దేవ్, మొలతోటి గురవయ్య, శ్రీమతి పోన్నర్సు సునీత, యనమద్ని వెంకటేశ్వర్లు, కత్తి అన్నోజీ రావు, షేక్ వలీ సాహెబ్, గంగవరపు సాంసందీర్, అచ్చిబిగారి షేక్ మొహమ్మద్ ఖాశీం తదితరులు మాట్లాడుతూ ఎస్.సి., ఎస్.టి సబ్ ప్లాన్ కచ్చితంగా అన్నీ శాఖల్లో అమలు చేయడంతో పాటు ఎస్.సి., ఎస్.టి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, అలాగే అవసరమైన గ్రామాల్లో స్మశాన వాటికల ఏర్పాటు మరియు ఎర్రగొండపాలెం పరిధిలో కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వం జన్ మన్ పథకం కింద మంజూరు చేసిన ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వమే నిర్మించి ఇవ్వడం గానీ లేదా యూనిట్ కాస్ట్ పెంచడం చేయాలని కమిటీ దృష్టికి తీసుకు వచ్చారు. అలాగే కమిటీ సభ్యులు పలు సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవిన్యూ అధికారి చిన ఓబులేసు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు లక్ష్మా నాయక్, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిఆర్డిఎ పిడి శ్రీ నారాయణ, డిటిడబ్ల్యూఓ శ్రీమతి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాయబ్ రసూల్‌కు టీడీపీ నాయకుల అభినందన

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండల కేంద్రమైన సియస్‌పురంలోని రహమత్ కాలనీకి చెందిన షేక్ జిలాని కుమారుడు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఎంబిబిఎస్ విద్యను అభ్యసించిన అనంతరం పోటీ పరీక్షలలో ఉచితంగా ఎం.డి సీట్ సాధించడం పట్ల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ముస్లిం మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వెంగయ్య మాట్లాడుతూ ఎండి విద్య అభ్యసించిన అనంతరం పేద ప్రజలకు ఉచితంగా సేవలు చేయాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఎంబీబీఎస్ సీటు, ఎండి సీటు ఫ్రీ సీటు సాధించడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు బొబ్బూరి రమేష్, మాజీ సింగిల్ విండో బత్తుల వెంకటాద్రి, వైస్ సర్పంచ్ పాములపాటి నరసయ్య సింగల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, లక్ష్మీదేవి, క్లస్టర్ ఇంచార్జి రజ్జాబ్ బాషా, డి.తిరుపతయ్య షాను, అబ్దుల్ రెహమాన్, పటాన్ ఖాజా, పఠాన్ నాయబ్ రసూల్, షేక్ అబ్దుల్ మహబూబ్, డాక్టర్ అక్బర్, డి నాగరాజు, షాను మాబు జిలాని పాల్గొన్నారు.

'భూ' సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర -వెలిగండ్ల : మండలంలో భూ సమస్యలు సున్నితంగా పరిష్కరించాలని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వెలిగండ్ల తహసీల్దార్ యన్.వాసుకి సూచించారు. సోమవారం మండలంలోని వెలిగండ్ల తహసీల్దార్ కార్యాలయం నందు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఎమ్మార్వో ఎన్.వాసుతో మండలంలో ఉన్న భూ సమస్యలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రైతులు చిన్నపాటి సమస్యలతో కార్యాలయానికి వచ్చినప్పుడు వాటిని సున్నితంగా పరిష్కరించి వివాదుల లేకుండా చూడాలని ఆయన తెలిపారు. ఈ క్రమంలో పాపిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన పశువుల బీడు కొంతమంది ఆక్రమించి అన్యాక్రాంతం చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వాటిపై దృష్టి సారించాలని ఎమ్మార్వోకి సూచించారు. ఈ క్రమంలో ఎమ్మార్వో మాట్లాడుతూ ఆ భూమిని పరిశీలించామని అందులో నోటీసు బోర్డు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యేకి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, వీఆర్వోలు నాగరాజు, శివ ప్రసాద్ తదితరులు రైతులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'లో ఏపీటీఎఫ్ నాయకులు

విశాలాంధ్ర-సిఎస్ పురం : సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ 1 వ తేదీ జరిగిన చలో విజయవాడ కార్యక్రమంలో సి యస్ పురం ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొని విజయవంతం చేశారు. దుర్మార్గమైన సి పి ఎస్ విధానాన్ని వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీయప్ నాయకులు షేక్ నాయబ్ రసూల్, డి సుబ్బరాయుడు, బి రవీంద్ర, ముప్పాళ్ళ ప్రసాద్, జి రామక్రిష్ణ, ఆర్ సుబ్బయ్య, యన్ వి నారాయణ, కె మహేశ్వర రెడ్డి, యన్ గాంధీ , ఖాజా రహంతుల్లా, జె సుబ్బారావు తదితరులు పాల్గొని మద్దతు తెలియచేసి విజయవంతం చేశారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి పాటు పడాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

విశాలాంధ్ర-త్రిపురాంతకం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోరకు పాటుపడాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి అన్నారు. రైతాంగ కోర్కెల దినోత్సవం పురస్కరించుకొని త్రిపురాంతకం మండలంలోని గాంధీ నగర్ గ్రామంలో రైతుసంఘం జండాను తిరుపతయ్య ఎగుర వేశారు. ఈ కార్యక్రమం రైతుసంఘం నియోజక వర్గ కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్బంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి,నియోజకవర్గ కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వాలు దేశానికీ వెన్నుక రైతు అంటూ ప్రకటనలకు, మీటింగుల్లో ఉపన్యాసలుకే పరిమితం అయ్యాయి. ప్రగాల్బాలు పలుకుతున్నారే తప్ప రైతుల సంక్షేమం కొరకు ఎటువంటి చర్యలు లేవన్నారు. రైతు ఆత్మహత్యల్లో భాగంగా భారత దేశం మొదటి స్థానంలో ఉందన్నారు. మహారాష్టలో ఒక్క సంవత్సర కాలంలో 780 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొని చనిపోవడం జరిగిందన్నారు.నరేంద్ర మోడీ అధికారంలో వచ్చిన తరువాత 11 సంవత్సరాల కాలంలో 4.50 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగిందన్నారు. కౌలు రైతులకు గుర్తిపు కార్డు, అన్ని ప్రభుత్వ పథకాలు అమలయ్యే విదంగా చర్యలు తీసుకోవాలని రైతాంగా కోర్కెలా దినోత్సవం సందర్బంగా డిమాండ్ చేస్తునమన్నారు. ఈ కార్యక్రమంలో బంగారయ్య, వెంకటేశ్వర్లు సుర్జా హాన్, భూలక్ష్మి, రమణమ్మ, అచ్చమ్మ, మేరీ పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే 'ఉగ్ర'

విశాలాంధ్ర -వెలిగండ్ల : మండలంలోని చోడవరం గ్రామ పంచాయతీలో 12లక్షలు రూపాయలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన మ్యాజిక్ డ్రైన్ పనులను కనిగిరి శాసన సభ్యులు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చేతుల మీదుగా భూమి పూజ చేసి సోమవారం పనులు ప్రారంభించినారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు వారి నివాసాలలో ఉపయోగించిన వ్యర్థ జలాలు (అనగా స్నానం చేసిన, బట్టలు ఉతికిన మరియు వంట సామాన్లు శుభ్రపరచిన) రోడ్ల వెంబడి నిలిచి ప్రజలకు అసౌకర్యం కలిగించడమే కాకుండా, సీజనల్ వ్యాధులు వ్యాప్తికి నిలయం గా మారుతుంది. అటువంటి పరిస్థితి ని మార్చటానికి ఈ మ్యాజిక్ డ్రైన్ ఉపయోగ పడుతుంది అని అన్నారు ఈ క్రమంలోడ్వామా పిడి జోసఫ్ కుమార్ మాట్లాడుతూ ముందుగా కాలువ నిర్మాణం జరిపే ప్రాంతం 0.55 మీటర్లు వెడల్పు మరియు0.55 మీటర్లు లోతు మట్టి పని జరిపి, కాలువ చివరలో అదనపు నీరు బయటకు వెళ్లేలా వాలుగా తవ్వాలి. మట్టిపని జరిపిన కాలువ రెండు వైపులా కడప స్లాబ్ రాళ్ళతో నిలిపిన తరువాత కాలువ భాగంలో మొదటి 20 సెంటిమిటర్లు 100-150 మీ మీ సైజు రాళ్లు, రెండవ లేయర్‌గా 60-75మీ మీ సైజు రాళ్లు, మరియు చివరిగా 10 సె. మి. మందం 20మి మీ సైజు కంకర వేసి కాలువ పుడ్చాలి. ఈ విధంగా నిర్మించిన కాలువ లో ఇంటి నుండి బయటకు వచ్చే వ్యర్థ నీటిని ఈ కాలువలో మల్లించినచో గ్రామం లో మురుగు లేకుండా పోతుంది. గ్రామీణభివృద్ధికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన కొన్ని పంచాయతీలలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, కొండు విజయ భాస్కర్ రెడ్డి ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంఛార్జ్ ఎంపీడీవోగా ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు సోమవారం ఇన్చార్జ్ ఎంపీడీవోగా డిఎస్‌వి ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ బుడంగుంట విజయ పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత ఎంపీడీవో. డి సురేష్ బాబు బాపట్ల ఈటిసి కేంద్రంలో నెలరోజులపాటు శిక్షణకు వెళ్లడంతో మద్దిపాడు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డిఎస్‌వి ప్రసాద్‌ను ఇన్చార్జ్ ఎంపీడీవోగా జడ్పీ సీఈవో చిరంజీవి ఉత్తర్వులు జారీ చేశారు. మీరు గతంలో చీమకుర్తి, సంతనూతలపాడు మండలాలకు ఇంచార్జ్ ఎంపీడీవోగా పనిచేశారు. ఎంపీపీ బుడంగుంట విజయ వారి భర్త నాగేశ్వరావు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో నేడు ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సు జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేమూరి రామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశా న్ని మండలం లోని 18 పంచాయతీల ప్రజలు రైతులు వినియోగించుకుని సమస్యలు ఏమైనా ఉంటే శాసనసభ్యుల దృష్టికి తీసుకురావాలని కోరారు రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు మాత్రమే పరిష్కరించబడతాయని తెలియజేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కొండపి : మండలంలోని అనకర్లపూడి గ్రామం సమీపంలో ప్రైవేటు హై స్కూల్ దగ్గర ఆర్ అండ్ బి రోడ్డు మీద బస్సు కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు మరిపూడి మండలం చిలంకూరు గ్రామానికి చెందిన వేజెల్ల గంగాధర్ (26 సంవత్సరాలు) వ్యక్తిగత పనుల నిమిత్తం కొండపి గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కొండపి నుండి ఒంగోలు వైపుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు అనకర్లపూడి గ్రామానికి సమీపంలో ఉన్న ప్రైవేటు హైస్కూల్ సమీపానికి వచ్చింది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం మీద ఉన్న గంగాధర్ రోడ్డు దిగి ఎక్కే క్రమంలో వాహనం స్కిడ్ అయ్యి బస్సు కింద పడిపోయాడు. గంగాధర్ మీద నుంచి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే రక్తగాయాలతో గంగాధర్ మృతి చెందాడు. గంగాధర్‌కి సుమారు సంవత్సరం క్రితమే వివాహం అయింది. దీంతో భార్య, కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. సంఘటన చూసిన గ్రామస్తులు ఆర్ అండ్ బి రోడ్డు గత కొన్ని నెలలుగా చింద్రమై ఉన్న ఆర్ అండ్ బి అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు జరిగి వ్యక్తుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని అంటున్నారు. రోడ్ల దుస్థితిపై ప్రజా ప్రతినిధులను సైతం గ్రామాల్లో నిలదీస్తే తప్ప రోడ్లు మరమ్మత్తుల గురించి పట్టించుకోరన ప్రజలు అంటున్నారు.

అధ్వానంగా రోడ్లు.. రాకపోకలకు అవస్థలు

- చోద్యం చూస్తున్న పాలకులు
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-పొన్నలూరు : రహదారులపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా ఓవి రోడ్ ముత్తరాజుపాలెం ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి రాత్రివేళ ఈ రహదారిపై వెళ్లాలంటేనే భయమేస్తుంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గుంతల వల్ల వాహనాలు ఓ పక్కకు వలిగి వెళ్లే పరిస్థితి దాపరించింది. ఈ రహదారి వెంట నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు రాత్రివేళ ప్రయాణించాలంటే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఈ రహదారిపై ద్విచక్ర వాహనాలు గుంతల్లో పడి వాహన చోదకులకు గాయాలు అయ్యాయి. ఇకనైనా సంబంధించిన ప్రజాప్రతినిధులు అధికారులు పట్టించుకోని రహదారిని గుంతలు లేకుండా ఏర్పాటు చేయాలని గ్రామాలలో ప్రజలు తెలుపుతున్నారు.

రాజ్యాంగ రక్షణే ప్రజల హక్కులకు భద్రత

విశాలాంధ్ర - కనిగిరి : రాజ్యాంగాన్ని రక్షించుకోవడంతో మాత్రమే ప్రజల హక్కులు కాపాడబడతాయని రిటైర్డ్ ఉపాధ్యాయులు పాప బత్తిన నారయ్య అన్నారు. సోమవారం అంబేద్కర్ ధర్మ పోరాట సమితి ఆధ్వర్యంలో ఒంగోలు బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాలకులు రాజ్యాంగాన్ని పక్కన పెట్టి సొంత విధానాలు ప్రవేశపెట్టడం సరైనది కాదని అట్టడుగు వర్గాలు, మహిళలకు రాజ్యాంగమే భద్రతనిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పందిటి మోహన్, చదలవాడ బాల గురవయ్య, పల్లా మాలకొండలరావు, చింతగుంట్ల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

21 మందికి పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులోని పంచాయతీ కార్యాలయంలో గత నెలలో ఆగిన 21 మందికి పెన్షన్లను టంగుటూరు మండల నాయకులు మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ బెల్లం జయంతి బాబు చొరవ తీసుకొని అర్హులైన వారికి పెన్షన్లు వచ్చేలాగా కృషి చేశారు. ఈ పెన్షన్ రావడంతో అర్హులైన వారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా టంగుటూరు మండల గ్రామ అభివృద్ధి చేస్తున్న మాజీ సర్పంచి బెల్లం జయంత్ బాబుకు మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్‌కు పెన్షన్ దారులు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ద్వారా అర్హులైన అందరికీ పెన్షన్ ఇస్తామని తెలియజేశారు.

తాగునీటి సమస్య రానివ్వం

- పట్టణంలో కొత్త బోర్లు
- ఎమ్మెల్యే ముత్తుముల వెల్లడి

విశాలాంధ్ర - గిద్దలూరు : రానున్న కాలంలో తాగునీటి సమస్య అనేది లేకుండా చేయడమే ధ్యేయంగా నూతన బోర్లు వేసేందుకు చర్యలు చేపట్టినట్లు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. గిద్దలూరు టౌన్‌లోని పిఆర్ కాలనీ ఆర్టిసి తదితర ప్రాంతాల్లో నూతన బోర్లు వేసేందుకు సోమవారం ఆయన టెంకాయ కొట్టి ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిద్దలూరు పట్టణంలో దాదాపు 30 వేల పైగా జనసాంద్రత ఉందని వారందరికీ తాగునీరు అందించేందుకు కావలసిన అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా మొదటి విడత అత్యవసరమైన మూడు ప్రాంతాల్లో మూడు బోర్లను వేసి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు నీటి సరఫరా సమృద్ధిగా ఇచ్చేందుకు తాను అనేక చర్యలు తీసుకున్న విధానాన్ని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏం సిస్ చైర్మన్ బైలడుగు బాలయ్య, మున్సిపల్ చైర్మన్ వెంకటసుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ రమణబాబు కౌన్సిలర్లు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలో సిద్దవరం గ్రామం ఎల్లమ్మ కిసాన్ గ్రూపుకు చెందిన డ్రోనును సోమవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ వ్యవసాయ సాగులో డ్రోన్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కే బాలాజీ నాయక్ మాట్లాడుతూ 80 శాతం రాయితీపై రైతులకు ప్రభుత్వం డ్రోనును మంజూరు చేయడం జరిగిందని, డ్రోన్ ఖరీదు 9,80,000, సబ్సిడీ ఏడు లక్షల 80000 రైతు వాటా 2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండల వ్యవసాయ అధికారి కే ప్రకాష్ రావు మాట్లాడుతూ డ్రోన్ ద్వారా జింక్ సల్ఫేట్ సూక్ష్మధా పోషకాలను పిచికారి చేయవచ్చునీ ఎక్కువ దూరాన్ని మరింత సులువుగా తక్కువ సమయంలో ఎకరాకు పది నిమిషాల్లో తక్కువ నీటితో పిచికారి చేయవచ్చు అన్నారు. ఎకరానికి 2500 నుంచి 3000 వరకు వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయని, డ్రోన్ ద్వారా పిచికారి చేయడం వలన పాముల వలన కానీ విషపురుగుల భారీ నుండి రైతులకు ఎటువంటి ప్రమాదం ఉండదని, డ్రోన్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారి చేయవచ్చు అన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాధుల విగ్రహాలను 6 వ రోజు సోమవారం నిమజ్జనానికి తరలిస్తున్నారు. మండల కేంద్రమైన ముండ్లమూరులోని వీరభద్రుని ఆలయం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక స్వామికి ఉదయం స్వామివారికి పూజలు అనంతరం మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా ట్రాక్టర్ పై ఏర్పాటుచేసి గ్రామంలో ఊరేగింపు చేస్తున్నారు. ఊరేగింపుగా వెళుతున్న గణనాధునికి గ్రామ ప్రజలు నీళ్లతో వారు పోస్తూ హారతులు పడుతూ పూజలు చేశారు. యువతి యువకులు గులాములు చల్లుకుంటూ డప్పు వాయిద్యాల మధ్య డాన్సులు వేస్తూ సందడి చేశారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవరోధాలు జరగకుండా ఎస్ఐ కే కమలాకర్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వేలంలో వినాయకుని లడ్డు దక్కించుకున్న పారాబత్తిని శ్రీహరి

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరిలోని 20వ వార్డులో గ్యాస్ గోడౌన్ వద్ద ఏర్పాటుచేసిన వినాయక చవితి మండపం వద్ద ఆదివారం లడ్డు వేలం పాటను నిర్వహించారు. ఈ వేలంపాటలో కనిగిరి మండలం బొమ్మిరెడ్డి పల్లి పంచాయతీ రాగిమనుపల్లి గ్రామానికి చెందిన పారాబత్తిని శ్రీహరి (రేషన్ డీలర్) రూ.26,116 రూపాయలకు వినాయకుని లడ్డును దక్కించు కున్నారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితిని అందరూ భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని అన్నారు. లడ్డు వేలంపాటలో లడ్డూను దక్కించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం వినాయకుని నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొని నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు వినాయక చవితి కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మీకోసం కార్యక్రమానికి మూడు అర్జీలు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమానికి ప్రజల నుండి మూడు అర్జీలు దాఖలైనట్లు తాహసీల్దార్ ఎస్ ఎల్ నారాయణ రెడ్డి తెలిపారు. సర్వే కొలతకు సంబంధించి ఒకటి పట్టాదారు పాస్ పుస్తకానికి సంబంధించి ఒకటి భూమి ఆక్రమణకు సంబంధించి ఒక అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో డి ఎస్ వి ప్రసాద్, ఎంఈఓ డి వెంకొరెడ్డి ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి బాయ్ ఆర్డబ్ల్యుఎస్ శాఖ ప్రతినిధి మేళం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలు శారదకు పదోన్నతి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరులోని ఎస్సీ కాలనీలో గల ఎంపీపీ ఎస్ హెచ్ డబ్ల్యు పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న తాతపూడి శారదా పదోన్నతి పొందారు. అందులో భాగంగా స్థానిక ఉపాధ్యాయులు ఆమెను పూలమాలలతో దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. పదోన్నతి పొందిన శారదా కురిచేడు మండలం పెద్దవరం ఎంపీపీ ఎస్ జనరల్ స్కూలుకు పదోన్నతి పై వెళ్లారు. ఈ సందర్భంగా హెచ్ఎం బి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా పని చేసిఎందరో విద్యార్థిని విద్యార్థులకు ఉత్తమ విద్యాభ్యాసం చేసి ఉన్నత చదువులు చదివేందుకు మార్గం శుభం చేశారు. ఈ కార్యక్రమంలో లలితా కిరణ్, మంజులవాణి, నాగమణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సును పొడిగించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని మక్కినేని వారిపాలెం, జమ్మలమడక గ్రామాలకు చెందిన 32 మంది విద్యార్థిని విద్యార్థులు బస్సు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారు. దీంతో సోమవారం ఒంగోలులోనే ఏపీఎస్ఆర్టీసీ ఒంగోలు ఆర్ఎంను కలిసి తమ కష్టాలను గోడును వెళ్లబోసుకున్నారు. మారెళ్ళ నుండి ముండ్లమూరు వరకు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నారు. జమ్మలమడక మక్కినేని వారి పాలెం గ్రామాల వరకు బస్సును పొడిగించాలని అభ్యర్థించారు. మరల సోమవారం ఒంగోలు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం కలవగా వెంటనే స్పందించి అద్దంకి ఆర్టీసీ డిఎంకి ఫోన్ చేసి ఆ రెండు గ్రామాల విద్యార్థుల కొరకు బస్సు ఏర్పాటు చేయండి అని ఫోన్లో సమాచారం చెప్పారని ఆ రెండు గ్రామాల ప్రజలు కోనంకి సైదులు, వై కృష్ణ, కే శ్రీను, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన

విశాలాంధ్ర - చీరాల టౌన్ : బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మొయిన్ సూచనలతో చీరాల పురపాలక సంఘ పరిధిలోని స్పెషల్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్,చర్చ్ కాంపౌండ్,అసపాలి మున్సిపల్ ఉర్దూ ప్రైమరి స్కూల్ విద్యార్థుల కోసం చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని చీరాల-1 టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు,చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఎస్సై హరిబాబు సంయుక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హరిబాబు విద్యార్థులకు శక్తి యాప్ గురించి వివరించారు.అత్యవసర సమయంలో మహిళలు తక్షణ సహాయం పొందేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్న విషయాన్ని తెలియజేశారు.యాప్ ఉపయోగించే విధానం గురించి వివరించారు.ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.బాల్య వివాహాలు అక్కడక్కడ జరుగుతున్నాయని,ఇది చట్టవిరుద్ధమైనదని స్పష్టం చేశారు.బాల్య వివాహాల వల్ల బాలికలకు ఆరోగ్య పరంగా పలు దుష్పరిణామాలు ఎదురవుతాయన్నారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు.ఎవరైనా బ్యాడ్ టచ్ చేస్తే వెంటనే గురువులకు,తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, విద్యార్థులకు సోషల్ మీడియా వాడకంపై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.హెల్ప్‌లైన్ నెంబర్లు 100,112 గుర్తుంచుకోవాలన్నారు.ఏదైనా సమస్య ఉన్నా,అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారం తెలిసిన భయపడకుండా హెల్ప్‌లైన్ నెంబర్లను వినియోగించుకొని పోలీసులను సంప్రదించాలని విద్యార్థులకు సూచించా రు. చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం సభ్యులు సుబ్బారావు,చీరాల మండల విద్యాశాఖాధికారి టి.రమాదేవి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ జానీబాషా,కె.శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు ఎన్.నారపరెడ్డి, సుమలత,సయ్యద్ ఆయేషా,పి.దానమ్మ, పి.విజయలక్ష్మి,విద్యార్థులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో యతిన్‌శ్రీకార్తికేయ ప్రతిభ

విశాలాంధ్ర - వేటపాలెం : గత నెల 29,30 తేదీల్లో భీమవరం వెస్ట్ బెర్రీ స్కూల్‌లో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలలో పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఎం.యతిన్‌శ్రీ కార్తికేయ ఫాయిల్ విభాగంలో తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.ఈ విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు తలమల దీప్తి, వ్యాయామ ఉపాధ్యాయులు కర్ర నాగేశ్వరరావు,తోట వెంకటేశ్వర్లు, సిబ్బంది బుద్ధి మోహన్‌రావు,లలితా పరమేశ్వరి, శ్రీనివాసరావు,భవానీ దేవి, సూర్యనారాయణ, బ్రహ్మయ్య, ప్రసన్నాంజనేయులు,రాజాలు అభినందనలు తెలిపారు.

కళ్యాణ మండపం ఆధునీకరణకు రూ.1,01,116

విశాలాంధ్ర - చీరాల టౌన్ : చీరాల ఎన్.ఆర్.పి.ఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు గుంటూరు రామ మోహనరావు ముంతావారి సెంటర్‌లోని ఎన్‌వి ఎస్,ఎస్‌జెఆర్ ఆర్య వైశ్య కళ్యాణ మండపం ప్రెసిడెంట్ జేబోలు బాబాజీరావుకి కళ్యాణ మండపం ఆధునీకరణ పనులు నిమిత్తం రూ.1,01,116లు ఇస్తానని వాగ్దానం చేశారు.దానికి రశీదు కూడా అందజేశారు.రాబోయే రోజులలో వాకింగ్ సభ్యులు డొనేషన్స్ ఎక్కువ మంది ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ,చారగుళ్ళ గురుప్రసాద్,నారాయణమూర్తి,వీరాంజనేయులు,కృష్ణమూర్తి,నాగవీర భద్రాచారి,శివాంజనేయ ప్రసాద్,శ్రీనివాసరావు,పూర్ణా సత్యం,గుద్దంటి రమేష్, సాంబశివరావు,మధుసూదనరావు,పూర్ణచంద్రరావు,చలపతిలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - చీరాల : నియోజకవర్గ పరిధిలోని శ్రీనివాస నగర్,విజయలక్ష్మీపురం,వేటపాలెం మండలంలోని రామాపురంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య స్వయంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లను అందజేశారు.కూటమి ప్రభుత్వం,చంద్రబాబు నాయకత్వంలో పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఉదయం 6 గంటల నుంచే మున్సిపల్ ఉద్యోగులు,సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేశారు.వృద్ధాప్య,వితంతు పింఛన్‌దారులకు రూ.4,000 చొప్పున,వికలాంగులకు రూ.6,000 చొప్పున ప్రభుత్వం అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. .ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,ప్రజా ప్రతినిధులు,కూటమి నాయకులు, మున్సిపాలిటీ సిబ్బంది,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లే

రైతులు జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : పొగాకు రైతులందరూ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లే ముందు పొగాకులో పాటించవలసిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌వీపి కుమారి అన్నారు.రైతుల పాటించవలసినవి తేమశాతం 20 కంటే తక్కువగా ఉండాలని,చెక్కులు ఓపెన్ చేసినప్పుడు వేడి ఉండకూడదని,నెమ్ము (తేమ) వలన ఆకులు మెత్తగా ఉండకూడదని,పొగాకు తేమ ఎక్కువై బూజు పట్టి ఉండ కూడదని, బొగులు పొగాకు ఉండకూడదని,నల్ల బొగులు పచ్చ బొగులు ఎర్రబొగులు గ్రేడింగ్ అపుడు తీసివేయాలని,పండుగుళ్ళ ఆకు తీసుకెళ్లకూడదని, చవుడు భూములలో పండించిన పొగాకు తీసుకెళ్లకూడదని,తెల్లబర్లీతో కలిపి, తేలిక నేలల్లో పండించే తెల్ల బర్లీ తో కలిపి తీసుకు వెళ్ళవద్దన్నారు. ముక్కలుగా ఉన్న లేదా చిరిగిన ఆకులు,ఉంటే తీసుకోరన్నారు.ఇలాంటి పొగాకులు తీసుకెళ్లినచో సిఆర్ చేయబడతాయి అన్నారు. తిరస్కరించబడతాయని మార్క్ ఫెడ్ వారు తెలియజేయుచున్నారన్నారు.కావున రైతులందరూ జాగ్రత్తగా తమ బేల్స్‌ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

విశాలాంధ్ర - అద్దంకి : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని అద్దంకి కేఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కళాశాలలో భోజన విరామ సమయంలో సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలని కోరుతూ అధ్యాపకులు నిరసన కార్యక్రమం చేపట్టారు.అనేక సంవత్సరాలుగా సీపీఎస్ రద్దు కోరుతూ పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభించడాన్ని వారు తప్పు పట్టారు.అధ్యాపకులు సురేష్ కుమార్,అశోక్ కుమార్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : ద్విచక్ర వాహనాన్ని ప్రమాదవశాత్తూ కారు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన సంతమా గులూరు మండలం వెల్లల చెరువు గ్రామ ప్రధాన రహ దారి శివారులో సోమవారం జరిగింది.108 వాహనం సిబ్బంది వివరాలు ప్రకారం అద్దంకికి చెందిన జి.తేజ,డి.కోటేశ్వరరావు ఇరువురు తమ బైకుపై వినుకొండ వైపు వెళ్తున్నారు.అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు,వీరి ప్రయాణిస్తున్న బైకును అదుపుతప్పి వేగంగా ఢీకొట్టడంతో రోడ్డు పక్కన పడిపోయారు.ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.దీనిపై సమాచారం అందుకున్న సంతమాగులూరు 108 వాహన సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి,మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తరలించారు.

దర్గాలో నగదు చోరీ అరెస్ట్

విశాలాంధ్ర - నిజాంపట్నం : దర్గాలో నగదు చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిజాంపట్నం ఎస్సై కందుల తిరుపతిరావు తెలిపారు.ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు.మండల కేంద్రమైన నిజాంపట్నంలో ఉన్న హజరత్ సయ్యద్ జైనుల్లాబిద్దిన్ బాబావలియా దర్గాలో గత నెల 30వ తేదీన రాత్రి దర్గా మెయిన్ గేట్ పగలగొట్టి దర్గాలోకి ప్రవేశించి హుండీనీ పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.1000 నగదును దొంగతనం చేశారని అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ గౌస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.ఈ మేరకు కేసు దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగతనం చేసిన వ్యక్తి నిజాంపట్నం గ్రామానికి చెందిన షేక్ ఉమర్ ఫరూక్ (51)గా నిర్ధారించి గత నెల 31న నిజాంపట్నంలోని గ్రామ సచివాలయం-3 దగ్గరలో ఉన్న బస్టాండ్ వద్ద నిందితుడిని అరెస్టు చేసి చోరీ సొత్తు రూ.1,020 నగదును రికవరీ చేసినట్లు తెలిపారు.సోమవారం ముద్దాయిని రేపల్లె అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 15 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు.

గట్కా పోటీల్లో కేజీబీవీ బాలికల ప్రతిభ

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఇటీవల పల్నాడు జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి గట్కా చాంపియన్ అండర్-14,17 పోటీల్లో ఏల్చూరులో ఉన్న సంతమాగులూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు సత్తా చాటారు.ఈ పోటీల్లో ఎస్.అమూల్య (9వ తరగతి),ఎం.కరిష్మా (10వ తరగతి) ఇద్దరూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ పసిడి పతకాలను కైవసం చేసుకున్నారు.అలాగే తొమ్మిదో తరగతి చదువుతున్న ఎల్.హన్నా, ఆర్.ఏంజెల్‌లే కాంస్య పతకం సాధించినట్లు పీఈటీ ఎస్.పెర్సూన్,శిక్షకుడు అఖిల్ తెలిపారు.ఈసందర్భంగా గట్కా ఛాంపియన్ విజేతలను విద్యాలయం ఎస్ఓ శ్రీలక్ష్మి,ఎస్ఎంసీ ఛైర్మన్ వల్లెం వెంకటరావు,వైస్ ఛైర్మన్ బూదాల ఇంద్రజ ఏసుదాసు,టీచర్లు,సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

నేడు చీరాలలో వైయస్ఆర్ వర్ధంతి

విశాలాంధ్ర- చీరాల : పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించేందుకు వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేసింది.పార్టీ ఇంఛార్జి కరణం వెంకటేష్ బాబు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2వ తేదీ (మంగళవారం) ఉదయం 10 గంటలకు గడియార స్తంభాల సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. బాపట్ల జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

అనూరాధకు అభినందనలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఇటీవల విడుదలైన 2025 మెగా డీఎస్సీ ఫలితాల్లో ఏల్చూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న గొడుగులూరి అనూరాధ అర్హత సాధించారు.ఈమేరకు ఆన్లైన్‌లో మెరిట్ లిస్టులో 21వ ర్యాంక్ వచ్చిందని తెలిపారు.సబ్జెక్టుల వారీగా చూస్తే ఎస్ఏలో 73.94 మార్కులు,పీజీటీలో 71,టీజీటీలో 69.6 మార్కులతో మూడింటిలో క్వాలిఫై అయ్యారు. పాఠశాల ఎస్ఓ శ్రీలక్ష్మి, ఎస్ఎంసీ ఛైర్మన్ వల్లెం వెంకటరావు,వైస్ ఛైర్మన్ బాదాల ఇంద్రజ,ఏసుదాసు, ఉపాధ్యాయులు,సిబ్బంది అనూరాధకు అభినందనలు తెలియజేశారు.అనంతరం అనూరాధ మాట్లాడుతూ తన విజయంలో సహాయ సహకారాలు అందించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో అక్షయ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన నాయకులు కామిశెట్టి సాయిబాబు అధ్యక్షతన మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ ఛైర్మన్ రాష్ట్ర జనసేన ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్ కుమార్,బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివ నారాయణ కలిసి ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. జిడుగు విజయ మాధురి,అల్లా బక్ష్,దినేష్,సలగల ప్రభుదాస్,జన సైనికులు,వీర మహిళలు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ అంబులెన్స్ సేవలు ప్రారంభం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చీరాల సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంబులెన్స్ సేవలను చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి టి.చంద్ర శేఖర్ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా దృక్పథంతో అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు అంబులెన్స్ సేవలను రెడ్ క్రాస్ సొసైటీ చీరాల బ్రాంచ్ అందించడం అభినందించవలసిన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.గోపీకృష్ణ,ముసలయ్య,బాదరాజు శశి కిరణ్, సర్విసెట్టి సుబ్బరామయ్య,ఎం.ఎస్ ప్రసాదరావు,సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

విశాలాంధ్ర - జె.పంగులూరు : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ సోమవారం జె.పంగులూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.పంగులూరులో ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు.అలాగే 41 మందికి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు.అసిస్ట్,మేఘా సంస్థల సీఎస్ఆర్ నిధులతో పొంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 316 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ బాచిన చెంచు ప్రసాద్,పంగులూరు మండల టీడీపీ అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళిక,దూరదృష్టి ఆలోచనతోనే రాష్ట్ర అభివృద్ధి

-విజనరీ నేత సీఎం చంద్రబాబు నాయుడు

-ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

విశాలాంధ్ర - వేమూరు : రాష్ట్ర అభివృద్ధి పట్ల ఒక విజనరీ కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు అన్నారు.సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలిసారి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి నేటికీ 30 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు కేక్ కట్ చేసి చంద్రబాబు నాయుడుకి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన ప్రణాళిక దూర దృష్టితో ఆలోచనలే నేడు రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు.విజన్ 20-20 అన్న నాడు అందరూ అవహేళన చేశారని నేడు ఆ ఫలితాలే మనం అనుభవిస్తున్నామన్నారు.చంద్రబాబు నాయుడు పదవి కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసమే పనిచేసే నాయకుడని,డ్వాక్రా గ్రూపుల రూపకర్త చంద్రబాబు నాయుడు అని తెలియజేశారు. చంద్రబాబు నాయుడు పట్ల ఉన్న విశ్వాసంతోనే రాష్ట్ర విభజన జరిగినా కాలంలో కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి చంద్రబాబు నేతృత్వం అవసరమని ప్రజల గ్రహించి అధికారాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. కానీ తర్వాత వచ్చిన ప్రభుత్వం రాష్ట్రాన్ని పాతాళానికి తొక్కేసిందని అది గ్రహించిన ప్రజలు తిరిగి మరల చంద్రబాబు నాయకత్వాన్ని కూటమి ప్రభుత్వాన్ని కోరుకున్నారన్నారు.ఆయన నేతృత్వంలో నూతన రాజధాని నిర్మాణం, నీటిపారుదల శాఖ ప్రాజెక్టులు పూర్తిగా నిర్మాణం జరుగుతాయని తెలియజేశారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ నాయకులు జొన్నలగడ్డ విజయబాబు,మండల పార్టీ అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య,షేక్ అనీఫ్,రాజేష్, ప్రసాద్,గంటా శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరించాలి: తహసీల్దార్

విశాలాంధ్ర - చిన్నగంజాం : అర్జీదారుల సమస్యలను ఓర్పుతో శ్రద్ధతో వీఆర్వోలు విని పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దార్ జీవీ గుంట ప్రభాకరరావు తెలియజేశారు.సోమవారం చిన్నగంజాం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓలు,సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు.సదరు సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంత్రులు,జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారుల నుంచి తహసీల్దార్ కార్యాలయం వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి ఆర్జీదారుల సమస్యలు ఓర్పుతో, ఓపికగా,శ్రద్ధగా విని వారికి మన పరిధిలో చేయవలసిన పనులను చేయగలమో లేదో అలాగే పై అధికారులకు పంపి పరిష్కారం చేయబడునో లేదో వివరంగా అర్జీదారులకు అర్థం అయ్యే భాషలో తప్పనిసరిగా విసుక్కోకుండా చెప్పాలన్నారు.అలాగే చిన్నగంజాం,పెద్దగంజాం గ్రామంలో ఎఫ్.పి.ఓ.ఎల్.ఆర్ త్వరగా పూర్తి చేయాలని,సూమోటో క్యాస్ట్, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం ఇతర రెవిన్యూ సర్వీసులు అన్నీ మీసేవ,గ్రామ వార్డు సచివాలయంలలో వచ్చు అర్జీలు నీటి తీరువా వసూలు చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా సక్రమంగా పని చేసి ప్రజలకు ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలని తహసీల్దార్ తెలియజేశారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

విశాలాంధ్ర -జె.పంగులూరు : విద్యోన్నతి ఫౌండేషన్ వారి సహకారంతో రూ.3 లక్షల ఉపకార వేతనాలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదగా విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సంవత్సరం జనవరి 5వ తేదీన అద్దంకి,పంగులూరు,కొరిశపాడు మండలాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దూళిపాళ్ల వెంకటేశ్వర్లు,బోడెంపూడి రామమూర్తి స్మారక ఉపకార వేతనాల కోసం నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులకు సోమవారం పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదగా ఒక్కొక్కరికి రూ. 10000లు చొప్పున రూ.3 లక్షల ఉపకార వేతనాలు అందించారని ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ తెలిపారు. ఫౌండేషన్ బాధ్యులు,నాయకులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా సచివాలయాల నిర్వహణ

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సచివాలయాల నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా ఉందని సరైన బోర్డులు లేక ప్రజలు పలు అవస్థలు పడుతు న్నారు.ఇసుకపల్లి మార్కెట్ యార్డు వద్దనున్న ఈ సచివాలయం ఒక నిదర్శనం అని చెప్పాలి. సచి వాలయం ముందు నేమ్ బోర్డ్ కనిపించకుండా సిమెంట్ వేయటంతో సచివాలయానికి పనులపై వచ్చే ప్రజలు సచివాలయం ఎక్కడ ఉంది అని తికమక పడుతూ రోడ్డుపై పోయే వారిని అడగటం జరుగుతుంది.సచివాలయం వద్ద ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు సచివాలయం ద్వారా సేవలు అందే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య ఉంటున్న అధికారులు ప్రజలకు సేవ చేయాలని కోరుతున్నారు.

దారి కబ్జాపై విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వం మా కుటుంబాన్ని పట్టించుకోవాలని షేక్ లాలు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తన సమస్యను అర్జీ రూపంలో జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. వివరాల్లోకి వెళితే కర్లపాలెం మండల కేంద్రంలో జామ్ జామ్ టీ స్టాల్ పక్కన తన గృహానికి ప్రభుత్వం మాకు రాకపోకలకు ఏర్పాటు చేసిన రహదారిని అక్కడున్న కొందరు వ్యక్తులు దాన్ని ఆక్రమించుకొని తన ఇంటికి దారి లేకుండా చేశారని ఆయన తెలియజేశారు.లక్షల రూపాయలు అప్పు చేసి నేను ఏర్పాటు చేసుకున్న నా గృహానికి ఈ విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన దారినే కబ్జాకు గురి చేయడం ఎంత వరకు న్యాయమని షేక్ లాలు తన ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపి తమ కుటుంబానికి న్యాయం జరపాలని ఆయన కోరారు.

వినాయకుడికి పూజలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో వినాయక చవితి పర్వదిన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక మండపాన్ని తెదేపా చీరాల నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్ సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కోటి మోహన్ కృష్ణ,చీరాల రూరల్ ఎస్సై చంద్రశేఖర్,బోయిన కేశవులు,బోయిన శివ,గ్రామనాయకులు,మహిళలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : రైతుల న్యాయబద్ధమైన భూ సమస్యలను పరిష్కా పించేందుకు రెవెన్యూ సదస్సును నిర్వహించడం జరిగిందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కొనకనమిట్లలోని తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన రెవెన్యూ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుకు పలు గ్రామాల నుంచి వచ్చి న రైతులు స్వయంగా భూ సమస్యలపై ఇచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వయంగాస్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ రైతుల న్యాయబద్ధమైన భూ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించామన్నారు. రైతుల సున్నా ఖాతాలు అగ్రిమెంట్ భూములు అసైన్మెంట్ భూముల ఆన్లైన్ ప్రక్రియను ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆపేసిందని వాటిపై అపోహలు విడనాడాలని ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనేఆ ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా నేను చెప్తేనే చెయ్యాలి అనే నిబంధన ఏమి లేకుండా అన్ని సక్రమంగా ఉంటే ఆ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తాసిల్దార్ ఆవుల సురేష్ మాట్లాడుతూ ఈ సదస్సుకు45 అర్జీలు వచ్చాయని విచారణ చేపట్టి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి మండల టిడిపి అధ్యక్షులు ఎం బాబురావు మండల టిడిపి జనరల్ సెక్రెటరీ భాషాపతి నాయుడు, వెలుగొండ దేవస్థానం చైర్మన్ కుందూరు కాశిరెడ్డి రేకటపల్లి చిన్నారి కట్ల సొసైటీల అధ్యక్షులు కనకం నరసింహారావు స్థానికమ్మ వెంకటేశ్వరరెడ్డి, పొదిలి ఏఎంసి వైస్ చైర్మన్ పందికి తిమోతి, ఎంపీడీవో డి ఈశ్వరమ్మ, వేంపాటి శ్రీకాంత్ రెడ్డి ముక్కాల శ్రీనివాసులు రెడ్డి మండల ఆర్ ఐ వీఆర్వోలు కార్యాలయ సిబ్బంది టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి ఉత్సవాలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని 17వ వార్డు,ఎస్.ఎన్.పి అగ్రహారంలో వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఆరవ రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు.వచ్చిన భక్తులందరికీ ఎలాంటి లోటు లేకుండా అన్నప్రసాదం అందించామని 1700 మందికి అన్న ప్రసాదాన్ని అందించామని కమిటీ సభ్యులు తెలిపారు. అన్నసంతర్పణ అనంతరం వినాయకుని ప్రతిమ వద్ద ఉన్న లడ్డూలకు వేలం నిర్వహించారు. మొదటి లడ్డూను మనలి రాజ్యలక్ష్మి రూ.35,000కు కైవసం చేసుకున్నారు.రెండవ లడ్డూను కత్తుల మేఘనాథ్ రూ.16,500కు కైవసం చేసుకున్నారు.అలాగే,వినాయకుని మెడలో ఉన్న లడ్డూల దండను మనలి చైతన్య,రూ.10,000కు దక్కించుకున్నారు.వేలంలో లడ్డూలు గెలుచుకున్న వారి ఇళ్లకు కమిటీ సభ్యులు మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు.మేళ తాళాలతో,భక్తి పాటలతో గణనాథుని నిమజ్జనానికి తరలించారు.

భార్యపై అనుమానంతోనే హత్య

- సీఐ మల్లికార్జున

విశాలాంధ్ర - బేస్తవారిపేట : గత నెల 22వ తేదీన మండలంలోని పీవీ పురం గ్రామ పొలాల్లో హత్యకు గురైన పగ్గాల రామలక్ష్మమ్మను భర్త పగ్గాల వెంకటేశ్వర్లు అనుమానంతో పథకం ప్రకారమే హత్య చేశాడని సీఐ కె. మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెళ్లయినప్పటి నుండి భార్యపై అనుమానం ఉండేదని, ఆ అనుమానం ఇంకా పెరిగి భార్యని ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకొని గత నెల 22న పొలంలో పని ఉందని చెప్పి భార్యను బైక్ పై ఎక్కించుకొని పొలానికి తీసుకెళ్లాడు. పథకం ప్రకారం ముందుగానే తెచ్చుకున్న గొడ్డలితో వెనుక వైపు నుండి ఆమె తలపై నరకడంతో కిందపడిపోయింది. దీంతో ఆమెను ముందు వైపుకు తిప్పి గొంతుపై గొడ్డలితో నరి కాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన రామలక్ష్మమ్మ అక్కడి కక్కడే మృతి చెందింది. భార్య చనిపోయిందని నిర్ధారించుకొన్న వెంకటేశ్వర్లు పారిపోతూ తన తమ్మునికి ఫోన్ చేసి మీ వదినను చంపేశాను, వాళ్ళ అమ్మవారికి చెప్పి శవాన్ని తీసుకెళ్లమని చెప్పినట్లు సీఐ తెలిపారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం సోమవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ సమీపంలో పగ్గాల వెంకటేశ్వర్లు ఉన్నట్లు సమాచారం అందడంతో అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి మోటార్ సైకిల్ ను, హత్యకు ఉపయోగించిన గొడ్డలిని, రక్తం మరకల చొక్కాను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ముద్దాయిని గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండల కేంద్రంలోని డి.జి. పేట రోడ్డులో గల వినాయక మండపం వద్ద వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బోయల్ల నారాయణరెడ్డి అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఎస్సై ఎం వెంకటేశ్వర నాయక్ హాజరై వినాయకుని దర్శించుకొని బోయళ్ల నారా యణరెడ్డిని, ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. జర్నలిస్టులు సంగిశెట్టి పీరయ్య నాయుడు, తిరుపతయ్య, తిరుపతి రెడ్డి, రేనాటి వెంక టేశ్వర్లు, మాలకొండయ్య, మల్లికార్జున, పాల్గొన్నారు.

వంశీకృష్ణ సేవలు ఆదర్శనీయం

ఎంఈవో కిషోర్ బాబు

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చాపల వంశీకృష్ణ దంపతులు చేస్తున్న సేవలు ఆదర్శనీయమని ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి కిషోర్ బాబు తెలియజేశారు. ఒంగోలులోని సత్యనారాయ ణపురం,ప్రకాశం కాలనీ-ఇస్లాం పేట ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలలో శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాలను ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి కిషోర్ బాబు ప్రారంభించారు.శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాలలో పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వారికి సాయంత్రం పూట ట్యూషన్లు చెప్పే విధంగా అర్హులైన మరియు అనుభవజ్ఞులైన టీచర్లను డాక్టర్ వంశీకృష్ణ సొంత నిధులతో నియమించి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలియజేశారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రముఖ ఎముకలు, కీళ్లు మరియు కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ చిన్నప్పుడు తాను కూడా గవర్నమెంట్ స్కూల్లో చదువుకున్నానని, ఇప్పుడున్న కనీస వసతులు కూడా అప్పుడు లేవని... ప్రభుత్వం పాఠశా లలను బాగా అభివృద్ధి చేసిందని, తన వంతు సహాయంగా ప్రభుత్వ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యార్థులకు ప్రతిభా అవార్డులు, విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత సెల్ ఫోన్లు చూడకుండా ఉంటామని, బాగా చదువుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ, సంతాన సాఫల్య స్పెషలిస్ట్ డాక్టర్ చాపల శాంత కుమారి మాట్లాడుతూ పేద విద్యార్థులకు తమ వంతుగా సహాయం చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు గోపి అనిల్ మరియు సత్యనారాయణపురం ,ప్రకాశం కాలనీ ప్రధానోపాధ్యాయులు హేమలత, పుష్పలత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర- ఒంగోలు: ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయాలని, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ అమలుపై సమీక్ష జరపాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గౌడ శ్రీ బాల వీరాంజనేయ స్వామికి దళిత నేత నీలం నాగేంద్రరావు కోరారు. సోమవారం కలెక్టరేట్లో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి స్వామిని మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షులు సుజన్ మాదిగ, మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాని రవితో కలిసి నేరం నాగేంద్రరావు దళిత సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా మాల మాదిగ కార్పోరేషన్లకు 2024- 25 ఆర్థిక సంవత్సరంలో వందల కోట్లు రూపాయలు కేటాయించా రే గాని, ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదన్నారు. అలాగే 2025 -26 ఆర్థిక సంవత్సరంలో వేల కోట్ల రూపాయలు మాల మాదిగ కార్పోరేషన్లకు కేటాయిస్తూ జీవోలు ఇచ్చారే తప్ప ఆన్లైన్లో కూడా నిలిపి ఆపేశారు అన్నారు. ఈ డబ్ల్యూ ఎస్ పేరుతో అగ్రకు లాలకు బీసీ కార్పొరేషన్ ద్వారా 50 సంవత్స రాల అర్హత కలిగిన సబ్సిడీ రుణాలకు దరఖా స్తు స్వీకరించారు అన్నారు. కానీ ఎస్సీలకు మాత్రం సబ్సిడీ రుణాలకు అర్హత 67 అని ప్రకటించారని. రాష్ట్రంలో జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీలకు రుణాలు ప్రకటించకుండా తూతూ మంత్రంగా ప్రకటించారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు, కోనేరు రంగారావు జీవోలు అమలు మంత్రిని దళిత నేతలు కోరారు.

దేశం గర్వించదగ్గ నాయకుడు చంద్రబాబు

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

విశాలాంధ్ర - బాపట్ల : దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడు చంద్రబాబు అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 1995 ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు నవంబర్ 1న ప్రజల వద్దకు పాలన అనే మహోన్నత కార్యక్రమంతో రాష్ట్రంలో నూతన ప్రగతికి బాటలు వేశారన్నారు.ఈ కార్యక్రమం దశాబ్దాలుగా కార్యాలయాలకే పరిమితమైన పాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చి, పారదర్శకత, ప్రజాకేంద్రీకరణను సాధించిందన్నారు.ఈ కార్యక్రమంతో ప్రజా సమస్యలను నేరుగా వినడానికి,పరిష్కరించడానికి అస్కారం ఏర్పడిందన్నారు.గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో అధికారులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించి నిజమైన ప్రజా పాలనకు నాందిపాలికార న్నారు. 1997 జనవరి 1 జన్మభూమి కార్యక్రమంతో చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో శ్రమదానం,సమగ్ర గ్రామీణాభివృద్ధి, మైక్రో-ప్లానింగ్ను ప్రోత్సహించార న్నారు.రాష్ట్రాభివృద్ధికి ఈ కార్యక్రమం ఉపయోగపడిందన్నారు.జన్మభూమితో గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేసేలా పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు 1996లో క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాన్ని చేపట్టి ప్రజా చైతన్యంతో గ్రామీణ పట్టణ ప్రాంతాలలో స్వచ్ఛత, పచ్చదనాన్ని పెంపొందించారన్నారు.2015లో నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన స్వచ్ఛ భారత్ అభియాన్ సబ్-గ్రూప్ కమిటీకి కన్వీనర్గా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించారన్నారు.ప్రతి పేదవాడికి రూ.5కే నాణ్యమైన భోజనం అందించేలా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారన్నారు.రోజువారీ కూలీలు, విద్యార్థులు,కార్మికులకు పెద్ద అండగా మారాయి అన్నారు.

దోర్నాల్లో డ్రైవర్స్ డే

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండల కేంద్రమైన పెద్ద దోర్నాలోని సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్షావలి ఆధ్వర్యంలో సోమవారం శ్రీశైలం రోడ్ లో సేఫ్టీ డ్రైవర్ రోజును డ్రైవర్లు నిర్వహించుకున్నారు. స్థానిక నటరాజ్ సెంటర్ నుండి ప్రవేట్ వాహనాల డ్రైవర్లు డ్రైవర్స్ డే సందర్భంగా ర్యాలీగా బయలుదేరీ, డ్రైవర్స్ డేను నిర్వహించుకున్నారు. అనంతరం డ్రైవర్స్ అసోసియేషన్ సేక్షావల్లి ఆధ్వర్యంలో సభా కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా డ్రైవర్స్ డే గురించి మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసుకొని డ్రైవర్స్ డే ను నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరిస్తాం : ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా అర్జీలు పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఫిర్యాదీదారులకు భరోసా కల్పించారు.జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన 57 మంది అర్జీదారులు కుటుంబ కలహాలు,అత్తారింటి వేధింపులు,ఆస్తి తగాదాలు, భూ వివాదాలు,ఆర్థిక లావాదేవీల మోసాలు,ఇతర పలు సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు.ఎస్పీ ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని,అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు.వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అర్జీలను చట్ట పరిధిలో వేగవంతంగా విచారించి,నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చెయ్యాలని ఆదేశించారు.అర్జీ దారుల సమస్యను పరిష్కరించడానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని పోలీస్ అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్,పిజిఆర్ఎస్ సెల్ ఎస్సై ఏ.నాగేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు: విజయరాజు

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలో యూరియా కొరత లేదని,రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి చుక్కా విజయరాజు అన్నారు.మండలంలోని ప్రజ్ఞం రైతు సేవా కేంద్రానికి వచ్చిన యూరియాను సోమవారం స్థానిక రైతులకు ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపట్నం,కూచినపూడి పీఏసీఎస్‌లకు అలాగే మండలంలోని గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలకు యూరియా దఫాల వారిగా వస్తుందని,వచ్చిన యూరియా వచ్చినట్లుగా రైతులకు అందించే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.కావున యూరియా విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.రైతులు తమ అవసరం మేరకే ఎరువులను తీసుకు వెళ్లాలని ఆయన సూచించారు.అలాగే పంట సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు.దీని వలన పంటల బీమా,పంట నష్టపరిహారం,పంట గిట్టుబాటు ధర (అమ్ముకోవడానికి) వంటి ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది,గ్రామ రైతులు పాల్గొన్నారు.

చీరాలలో దళిత చైతన్య దినోత్సవం

విశాలాంధ్ర - చీరాల : కారంచేడు ఘటన అనంతరం ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక అంబేద్కర్ భవనంలో దళిత చైతన్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు.సభకు గొర్రెపాటి రవికుమార్ అధ్యక్షత వహించారు.చీరాల పరిసర ప్రాంతాల నుండి దళిత సంఘాల నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా కట్టా రాజ్ వినయ్‌కుమార్,బి.పరంజ్యోతి,గోశాల ఆశీర్వాదం,మాచర్ల మోహన్‌రావు,దామర్ల శ్రీకృష్ణ,ఎన్.మోహన్‌కుమార్ ధర్మ,యస్.యాన్ భగత్‌సింగ్,చుండూరు వాసు, శీలం రవి,ఊటుకూరు వెంకటేశ్వర్లు,కంచర్ల చిట్టిబాబు తదితరులు ప్రసంగించారు. వారు మాట్లాడుతూ దళిత సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవడంలో ఐక్యతే ప్రధాన ఆయుధం,అన్ని సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చి ఉమ్మడిగా కదిలితేనే అణగారిన వర్గాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీటర్, డొక్కా జగన్ మోహన్,కాటి మార్క్,పుల్లయ్య,హరి హరరావు,బాబురావు, అర్జునరావు, గోశాల అశోక్,డానీ,సాల్మన్ రాజ్,మహేంద్ర,కలామ్,షరీఫ్,సంగీత రావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలి

- సీపీఐ ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ

విశాలాంధ్ర - రేపల్లె : స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసి బస్సులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధిని కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ఉపాధి అవకాశాలను కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ,ఏఐటీయూసీ వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు వందారు శ్రీనివాసరావులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆటో డ్రైవర్లకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన భట్టిప్రోలులోని లక్ష్మి గణపతి ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ కార్మికులు స్థానిక బస్టాండ్ వద్ద నుండి మండల రెవెన్యూ కార్యాలయం వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించి మండల తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బాలాజీ,శ్రీనివాస రావులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామన్నారు.అయితే మహిళల ఉచిత ప్రయాణం ఆటో కార్మికుల జీవన ఉపాధిపై కోలుకోలేని విధంగా దెబ్బతీసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఆటో కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. రోజంతా కష్టపడినా ఆటో కార్మికుల జీవనం దుర్భరంగా మారిందని వారు ఆందోళన చెందారు.దీంతో అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసిన కార్మికులు ప్రతినెల కిస్తీలు చెల్లించలేక ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు.కుటుంబ పోషణ కష్టంగా మారిన ఆటో కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.అలాగే ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తామని,ఈ చలానా 30 శాతంకు తగ్గిస్తామని,జీవో నెంబర్ 21,31లను సవరిస్తామని,ఆటో డ్రైవర్లకు వ్యక్తిగత ప్రమాద చంద్రన్న భీమా పాలసీని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతామని,ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల ఆరోగ్య అభిమానం అమలు చేస్తామని ఇచ్చిన తదితర హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమ నాయకులు సజ్జ విశ్వనాథం,ఆటో యూనియన్ అధ్యక్షులు కట్టా వెంకటేశ్వరరావు,నాయకులు నాగూర్ మీరా, పీటర్ పాల్, అశోక్, కర్రా చిన్నా, శ్రీనివాసరావు, నాయక్, నరసింహ, ఎం.హరి, ఆనందరావు, అబ్రహాం,హీబ్రూ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : పొదుపు మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.డి.ఆర్.డి.ఏ ద్వారా పాడి గేదెల పెంపకం యూనిట్ల అమలు తీరుపై సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. పొదుపు మహిళలకు పాడి గేదెలు ఇవ్వడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి,ఆర్థిక అభివృద్ధిలోకి పయనిస్తారని కలెక్టర్ చెప్పారు.ఈ ఆర్థిక సంవత్సరంలో 70 వేల కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నా రు. 16వేల పొదుపు సంఘాలకు గేదెలు, మేకలు, గొర్రెల యూనిట్లు స్థాపించాలన్నారు. మిగిలిన వారికి పౌల్ట్రీ,గడ్డి నాటడం వంటి తదితరమైన యూనిట్లు మంజూరు చేయాలన్నారు.డ్వాక్రా మహిళలు స్వయం ఉపాధితో లక్షాధికారులను చేయాలని ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.వీటిల్లో ప్రధానంగా 12,500 గేదెల పెంపకం యూనిట్లు స్థాపించాలన్నారు. ఈ యూనిట్‌లను స్థాపించడానికి సామాజిక పెట్టుబడి నిధి,శ్రీనిధి,ఉన్నతి పథకం,బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదపాయం కల్పించాలన్నారు. శ్రీనిధి కింద ఇప్పటికే రూ.260 కోట్ల రుణాలు జిల్లాకు కేటాయించినట్లు వివరించారు.ఇప్పటి వరకు 72 గేదెల యూనిట్లను లబ్ధిదారులకు అందించామన్నారు. అలాగే 25 అరకు కాఫీ సెంటర్లు జిల్లాలో ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. అద్దంకి నియోజకవర్గంలో 2,500 గేదెల యూనిట్లు,పర్చూరులో మూడువేల యూనిట్లు,చీరాలలో ఒక వెయ్యి యూనిట్లు,బాపట్లలో 1500,రేపల్లెలో 2000,వేమూరులో 2500 యూనిట్లు సమర్పించాలని లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఏ పీడీ శ్రీనివాసరావు,పశుసంవర్ధక శాఖ అధికారి పాల్గొన్నారు.

జేవీవీ మహాసభలను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దబ్బకూటి హరిబాబు కోరారు.ఈ మేరకు జన విజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహా సభల పోస్టర్లను సోమవారం నిజాంపట్నం ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ-2 జి.శేషు గోపాలం అలాగే నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం పి.శివన్నారాయణ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఈ నెల 13,14 తేదీలలో విజయనగరంలో జరిగే రాష్ట్ర మహా సభకు ఉపాధ్యాయులు,సామాజిక చైతన్య కలిగిన వారు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐక్య ఉపాధ్యాయ (యూటీఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్ చుక్కా బాపయ్య,జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.కుమార్,సయ్యద్ అరుణ్,పాఠశాల ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయా సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - మార్టూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల జీవితాల్లో వెలుగు నింపాలనే సంకల్పంతో అహర్నిశలు శ్రమిస్తున్నారని,పింఛన్ పెంపుపై ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేసి చూపారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు.సోమవారం పేదల సేవలో భాగంగా కోనంకి గ్రామంలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.సచివాలయ సిబ్బందితోపాటు ఉదయం 8 గంటలకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.సీఎం చంద్రబాబు పాలన ఎలా ఉందంటూ అవ్వతాతలతో కొద్దిసేపు ముచ్చటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వం ఘనత అన్నారు.ఎన్ని ఇబ్బందులు ఎదురైన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.4000 పెన్షన్ అమలు చేశారని గుర్తు చేశారు.పేదల సంక్షేమానికి బాటలు వేస్తూ పేదరికం లేని సమాజమే లక్ష్యంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.మలి వయసులో ఉన్న వారికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవనం సాఫీగా సాగేలా పింఛన్ పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు.ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగదన్నారు.ఒక నెల పెన్షన్ తీసుకోకపోయినా మరో నెల రెండు నెలలు కలిపి ఇవ్వాలని సీఎం చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రశాంతి, ఇన్‌ఛార్జి ఎండిఓ రాంబాబు, టీడీపీ నాయకులు కోటపాటి సురేష్,ఏసుపాదం, వీరవల్లి శ్రీరాములు,సుబ్బారావు,కాజారావు,రమేషు తదితరులు పాల్గొన్నారు.